# ప్రత్యేక ఆర్థిక మండళ్లు... లాభనష్టాలు!!

మన దేశంలో ఇటీవల కాలంలో ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్‌ఈజెడ్‌లు) వివాదాస్పదమయ్యాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్లను రద్దు చేయాలని కోరుతూ... దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. గోవాలో గత రెండేళ్లుగా ఆందోళనలు కొనసాగుతుండటంతో.. తమ రాష్ట్రంలోని మూడు ప్రత్యేక ఆర్థిక మండళ్లను రద్దు చేయాల్సిందిగా ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రాన్ని కోరింది. చట్టరీత్యా ఒకసారి ప్రకటించిన ఎస్‌ఈజెడ్‌ను రద్దు చేయడం కుదరదంటూ.. కేంద్రం, గోవా ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించింది. ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని.. ప్రభుత్వానికి పన్నుల రూపంలో అదనంగా ఆదాయం సమకూరుతుందని.. ఇది ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందని.. ఎస్‌ఈజెడ్‌లను సమర్థించే వారు వాదిస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వందల ఎకరాలను చౌక ధరలో సేకరించి.. పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నాయని.. వాటిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు విస్తృ తంగా లాభాలు ఆర్జిస్తున్నారని.. వాటిని వ్యతిరేకించే వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఏదైనా కారణంతో ప్రత్యేక ఆర్థిక మండలి హోదాను రద్దు చేస్తే... అందుకు కేటాయించిన భూమి ప్రమో టర్ల పరం అవుతుంది. దాన్ని వారు గృహ, వాణిజ్య సదుపాయాల అభివృద్ధి కోసం వినియోగించి.. విపరీత లాభాలను ఆర్జించడానికి అవకాశముంది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఐటీ రంగానికి కేటాయించిన ఆర్థిక మండలిని రద్దు చేయమంటూ... దాన్ని ప్రమోట్ చేసిన డీఎల్‌ఎఫ్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ, ప్రభుత్వాన్ని కోరింది. ఆ అభ్యర్థనను ప్రభుత్వం ఆమోదిస్తే... ఐటీ రంగం కోసం సేకరించిన విలువైన భూమి గృహ, వాణిజ్య సముదాయాల నిర్మాణాల ఏర్పాటుకు కారుచౌకగా మళ్లే ఆస్కారముంది.

## ఎస్‌ఈజెడ్‌లు- పుట్టుపూర్వోత్తరాలు:

1929లో మొదటిసారిగా స్పెయిన్‌లో ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కొనసాగిన ఆ రోజుల్లో... స్కిల్డ్ మ్యాన్‌పవర్‌ను వినియోగించి.. వస్తూత్పత్తిని పెంచడానికి ఈ విధానం దోహదపడింది. 1960లో అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు.. తృతీయ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఈ విధానాన్ని వినియోగించాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల విధానానికి తెరతీసిన మొదటి దేశం భారత్. ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి.. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి.. 1965లోనే మన దేశం ఎస్‌ఈజెడ్‌లకు నాంది పలికింది.

కాండ్లాలోని ప్రత్యేక ఎగుమతి మండలి, శాంతాక్రుజ్ ఎలక్ట్రానిక్ ఎగుమతుల మండలి, కొచ్చిన్, చెన్నై, విశాఖపట్నం, ఫాల్టా, నోయిడా, సూరత్‌లలోని ఎగుమతుల మండలాలు.. 1998 నాటికల్లా ప్రత్యేక ఆర్థిక మండళ్లుగా రూపాంతరం చెందాయి. 1980 నుంచే చైనా ఈ విధానాన్ని చురుకుగా అమలు చేస్తోంది. 2000లో అప్పటి మన వాణిజ్య శాఖమంత్రి మురసోలి మారన్ చైనాలో పర్యటించారు. ఆయన అక్కడి

పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి.. 2000, మార్చిలో వార్షిక ఎగుమతి-దిగుమతి (Exim) విధానాన్ని ప్రకటించారు. 2005లో ప్రత్యేక ఆర్థిక మండళ్ల చట్టం అమల్లోకి వచ్చింది. ఎగుమతి మండళ్లు.. రెడీమేడ్ వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు, వజ్రాలు, తినుబండారాలు మొదలైన వాటిని ఎగుమతి చేస్తాయి. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు విత్తపరమైన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుంది. వ్యాపార కార్యకలాపాలకు సంబంధించి ఈ మండళ్లు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. వీటికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇతర దేశాల నుంచి ముడి సరకులు, యంత్ర భాగాలు దిగుమతి చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంది. వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉంది. లాభాలను విదేశీమారక ద్రవ్యరూపంలో ఇతర దేశాలకు తరలించుకునే వీలుంది. ఇన్ని రాయితీలు, ప్రత్యేక సదుపాయాలు పొందుతున్న ఈ మండళ్ల నుంచి దేశానికి, సగటు పౌరుడికి ఏం లభిస్తోంది? ప్రభుత్వ విధానంలో స్పష్టత లోపించడం వల్ల ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా... ఏ మేరకు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించవచ్చో నిర్ణయించలేదు. 2008లో కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం- కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ పన్నుల రూపంలో రూ.246.72 కోట్లు కోల్పోయింది. ఈ మండళ్లకు దేశీయంగా సరఫరా చేసే సరకులు, సేవలను కూడ ఎగుమతులుగా పరిగణిస్తూ... ఆ అమ్మకాల ద్వారా లభించిన మొత్తాన్ని విదేశీమారక ద్రవ్యంగా చూపిస్తున్నారని ఆడిటర్ జనరల్ నివేదిక పేర్కొంది. సామాజిక, ఆర్థికరంగాల విషయంలో ప్రభుత్వ విధానం విఫలమైందని ఆ నివేదిక అభిప్రాయపడింది. ఉదార ఆర్థిక విధానాల్ని సమర్థించే వారి అభిప్రాయంలో- విదేశీ పెట్టుబడులు, ఎగుమతుల అవకాశం, ఉపాధి అవకాశాల మెరుగుదల, సాంకేతిక నిపుణత బదిలీ, దేశ ఆర్థిక ప్రగతి మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటే... పన్నుల రూపంలో కోల్పోయే ఆదాయం పెద్ద నష్టంగా భావించనవసరంలేదు. నేడు భారత్ ఒక పెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందంటే.. అందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార ఆర్థిక విధానాలే కారణమన్నది వీరి వాదన. విదేశీ పెట్టుబడులు.. ప్రభుత్వం కల్పించే ఆకర్షణీయ రాయితీలపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం లభిస్తున్న అనేక రాయితీలు 15 ఏళ్ల తర్వాత లభించవు. దాంతో సహజంగానే విదేశీ పెట్టుబడులు వేరే దేశానికి తరలివెళ్తాయి. గత ఐదారు నెలల కాలంలో.. మన దేశంలోని విదేశీ పెట్టుబడులు ఏ మేరకు ఉపసంహరణకు గురయ్యాయో తెలిసిందే. ప్రపంచ ఆర్థిక ప్రకంపనాలకు బడుగు దేశాలు బలవుతాయి. బహుళజాతిసంస్థలు (ఎంఎన్‌సీలు).. కార్మికులు చౌకగా లభించే ప్రాంతాలకు తరలి వెళ్తాయి. తైవాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు.. చైనాతో పోటీ పడలేక కొన్ని మిలియన్ల ఉద్యోగాలు కోల్పోవడం జరిగింది. నియంతృత్వ ప్రభుత్వాలున్న దేశాల్లో... కార్మిక వేతనాలను నియంత్రించవచ్చు. ప్రజాస్వామ్య దేశాల్లో అలా కుదరదు.

## ఉపాధి మాట...!

ప్రత్యేక ఆర్థిక మండళ్ల వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయ నేది వాస్తవం. కాండ్ల రేవును ప్రత్యేక

మండలిగా ఏర్పాటు చేసినప్పుడు... కేవలం 70 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయి. నేడు అక్కడ లక్ష మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇది దీర్ఘకాలిక ప్రాతిపదికగా కొనసాగనవసరం లేదు. చౌకగా కార్మికులు లభించినంతకాలం.. ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతాయి. రాయితీలు ఉపసంహరించిన మరుక్షణమే ఇవి అంత ర్థానమయ్యే ఆస్కారముంది. పైగా ఈ మండళ్లలో పనిచేసే వారిలో ఎక్కువమంది మహిళలు... రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేస్తూ.. కనీస వేతనానికి కూడా నోచుకోవడం లేదు. దేశవ్యాప్తంగా అమలులోనున్న కార్మిక శ్రేయస్సు చట్టాలు వీరికి వర్తించవు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే వీరు ఏ క్షణమైనా ఉద్యోగం కోల్పోయే అవకాశ ముంది. రాత్రి వేళల్లో పని చేయడం.. ప్రసూతి సెలవులు లభ్యం కాకపోవడం.. లైంగిక వేధింపులు... వంటి ప్రతికూల పరిస్థితులను సెజ్‌లలో పనిచేసే శ్రామికులు ఎదుర్కొంటున్నారు. జౌళి పరిశ్రమలో పనిచేసే అనేకమంది మహిళా కార్మికులు ఆస్థమా లాంటి వ్యాధులకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఏ దేశంలో కూడా నిజమైన జాతీయ ప్రగతి... విదేశీ పెట్టుబడుల వల్ల, ఎగుమతుల వల్ల జరగలేదు. భారత ప్రభుత్వం, ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO)కు సమర్పించిన నివేదికలో (1999)– ''బహుళ జాతి సంస్థల కార్యకలాపాల వల్ల 25 నుంచి 40 శాతం విదేశీ పెట్టుబడులు వర్ధమాన దేశాలపై నకారాత్మక ప్రభావాన్ని చూపిస్తున్నాయని'' పేర్కొంది. మరి అలాంటప్పుడు విదేశీ పెట్టుబడుల కోసం భారత ప్రభుత్వం ఎందుకు అంతగా అరాటపడు తున్నట్లు! భారత్‌కు మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు అవసరం. అయితే, బ్యాంకింగ్, ఐటీ రంగాల్లో మాత్రమే విదేశీ పెట్టుబడులు ముందుకు వస్తున్నాయి. ఆ రంగాల్లోకే ఎందుకంటే... తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలను గడించడానికి ఆ రంగాలు అనువైనవి కాబట్టి!

## వ్యవసాయానికి ముప్పు!

నేటికీ భారత్‌లోని 65 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనా ధారం. పారిశ్రామికీకరణ వ్యవసాయానికి అనుబంధం కావాలి. కాని, వ్యవసాయం పారిశ్రామికీకరణకు అనుబంధం కానక్కర్లేదు. మౌలిక సదుపాయాలు సమకూర్చాలనే నెపంతో విలువైన వనరులను మనం దుర్వినియోగం చేస్తున్నాం. దీనివల్ల భవిష్యత్తులో వ్యవసాయం, పరిశ్రమలు దెబ్బతింటాయి. గుడ్డిగా చైనాను అనుకరించడం కూడా సరికాదేమో! కొంతమేరకైనా సామ్య వాద విధానాలు ఆ దేశంలో కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రజలకు వృద్ధాప్య పింఛన్లు, ఉచిత వైద్య సదుపాయాలు లభిస్తాయి. మన దేశంలో అలాంటి సామాజిక భద్రతా విధానం దేశవ్యాప్తంగా అమల్లో లేదు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు.. రియల్ ఎస్టేట్ మండళ్లుగా మారుతున్నాయి.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 1.25 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని ఈ మండళ్ల కోసం సేకరించడం జరిగింది. ఒరిస్సా ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి, షెడ్యూల్ తెగల భూమిని కూడ బయటివారికి బదిలీ చేయడానికి సిద్ధమవుతోంది. ముంబయి పరిసరాల్లో 14,000 హెక్టార్ల వ్యవసాయ భూమిని ప్రత్యేక ఆర్థిక మండలికి కేటాయించారు. ఒక్క రిలయన్స్ కంపెనీ చేతిలోనే 60,000 ఎకరాలు సెజ్‌ల రూపంలో

ఉందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దాల్మియా, మహేంద్రా, అన్సాల్, బన్యన్ వంటి బడా పారిశ్రామికవేత్తలు.. 21వ శతాబ్దం జమీందార్లుగా ఎదుగుతున్నారు. ఎకరాల్లో భూమిని కారు చౌకగా కొని.. మీటర్లలో అత్యధిక ధరలకు అమ్ముతున్నారు. నవీ ముంబయిలో చదరపు మీటరు ఖరీదు రూ.55000– 75000గా ఉంది. మిలియన్ల కొద్దీ గ్రామీణ ప్రజలు నిర్వాసితులవుతూ, పొట్టచేతపట్టుకొని పట్టణ ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వస్తూ మురికివాడల్లో మగ్గిపోతుంటే.. పట్టణాల్లోని సంపన్న వర్గాలకు క్లబ్బులు, విలాసవంతమైన గృహాలు, సూపర్ స్పెషా లిటీ ఆస్పత్రులు, అంతర్జాతీయ బ్యాంకుల కోసం విలువైన వ్యవసాయ భూమిని త్యాగం చేయడం ఎంత వరకు సమం జసం? నేడు సగటు భారత పౌరుడుకి కావాల్సింది ప్రత్యేక ఆర్థిక మండళ్లు కాదు.. ''ప్రత్యేక న్యాయ మండళ్లు''!!

SAKSHI